


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 350 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 20 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :350 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 20 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి
- అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు.మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

- మిగతా 2లో


## మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వర్ల రామయ్య
- మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రామయ్య
- ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు లోకేశ్‌కు కృతజ్ఞతలు
- కూటమి విజయాలను మండలిలో వినిపించాలని సూచించిన మంత్రి



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత వర్ల రామయ్య గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆయనకు

- మిగతా 2లో



## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

**అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు**

- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

పెన్ పవర్ డెస్క్:గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్–1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి,

- మిగతా 2లో

# ఎన్నికలకు సిద్ధంకండి..
# గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు.


వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి

పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో

- మిగతా 2లో





## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

**మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి**

పెన్ పవర్ డెస్క్: త్వరలో కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు మాజీ ఎంపీ విజయ సాయి రెడ్డి ప్రకటించారు.

- మిగతా 2లో



## బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

- ఈడీ విచారణకు హాజరైన నటి నిధి అగర్వాల్
- బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో విచారణ
- హవాలా మార్గంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు
- ఇప్పటికే పలువురు నటులను ప్రశ్నించిన ఈడీ

- మిగతా 2లో



## జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

- జమ్మూకశ్మీర్ భారత్‌లో కీలక భాగం అన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తొలిసారి కశ్మీర్‌లో పర్యటిస్తున్న యూఎస్ ప్రతినిధి
- భద్రత మెరుగుపడింది, ప్రయాణ ఆంక్షలు సడలించాలన్న రాయబారి
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలతో భేటీ, లెఫ్టినెంట్ గవర్నర్‌తోనూ సమావేశం

- మిగతా 2లో

## భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

- టికెట్ ధరల పెంపుపై తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో
- పెంచిన టికెట్ వసూళ్లలో 20% సంక్షేమానికి కేటాయింపు
- టీజీఎఫ్‌డీసీ, సినీ కార్మికుల ఫెడరేషన్‌కు ఈ మొత్తం
- నిర్మాతలు ఎగ్జిబిటర్ల నుంచి వసూలు చేయాలని ఆదేశం
- 'పెద్ది', 'రాజాసాబ్' వంటి భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తింపు

- మిగతా 2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు



పెన్ పవర్ డెస్క్: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమ ల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి

- మిగతా 2లో

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..




పెన్ పవర్ డెస్క్: మేయర్, మున్సిపల్ చైర్మన్ ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది ఏపీ అసెంబ్లీ. బుధవారం ( ఆగస్టు 19 ) సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు మంత్రి నారాయణ. ప్రస్తుతం మేయర్,

- మిగతా 2లో



## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నాగబాబుకు పదవి... పవన్ ఇక మారేట్లులేరుగా?

జనసేనలో ఏ పదవి అయినా నేతలు ఎన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ వారి ఆశలు మాత్రం అడుగంటుతూనే ఉన్నాయి. పవన్ కల్యాణ్ తన కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జెండా మోసిన వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శలకు మరింత బలం చేకూర్చే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా 'ఏపీ గ్రీన్' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా నాగబాబు పదవిని కేటాయించింది. కేబినెట్ ర్యాంకు పదవి. నామినేటెడ్ పోస్టు. అన్నింటా సామాజికన్యాయం, తనకు కులం, కుటుంబంతో సంబంధం లేదని పదే పదే చెప్పే పవన్ కల్యాణ్ పదవుల విషయానికి వచ్చేసరికి తనకే ప్రయారిటీ ఇవ్వడాన్ని ప్రశ్నించలేకపోతున్నారు కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఈ నిర్ణయం పై వ్యతిరేకత తీవ్రంగానే కనిపిస్తుంది.

**మంత్రివర్గంలో చోటు దక్కుతుందని...**

నాగబాబుకు మంత్రివర్గంలో పూర్తి స్థాయి బెర్త్ లభిస్తుందని భావించారు. తమకు నామినేటెడ్ పోస్టు దక్కుతాయని జనసేన క్యాడర్ మరియు నేతల్లో ఈ నిర్ణయం కొంత నిరుత్సాహానికి, చర్చకు దారితీసింది. ఏపీ సైంటిఫిక్ అండ్ ఎకోలాజికల్ గ్రీనింగ్, రీఫారేస్టేషన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నియమించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న అటవీ మరియు పర్యావరణ శాఖ పరిధిలోనే ఈ నియామకం జరిగింది.జనసేన వర్గాల్లో చర్చ మాత్రం మొదలయింది. అసలు తమకు ఎప్పటికైనా పదవి లభిస్తుందా? అన్న అనుమానాలు వారిలో కనిపిస్తున్నాయి. నాగబాబు హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉంటారు. పార్టీ కోసం ఆయన పడిన దానికంటే రెట్టింపు కష్టపడిన వారు అనేక మంది జనసేనే నేతలు ఉన్నారు. తమ ఆస్తిపాస్తులను కూడా పోగొట్టుకున్నారు.

**ప్రత్యేకత ఏంటి?**

ఎన్నికల నుంచి పార్టీ కోసం కష్టపడిన నాగబాబుకు మంత్రివర్గంలో ప్రత్యక్ష స్థానం దక్కుతుందని అందరూ భావించారు. కానీ కేబినెట్ లో చోటు లభించలేదు. ఇది మంత్రి పదవి కాకపోవడంతో ఆ పదవి వేరే వారికి ఇవ్వవచ్చు కదా?అన్న ప్రశ్న తలెత్తుతుంది. నాగబాబు ఇప్పటికే ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయనకు అదనంగా ఈ పదవి ఎందుకు అన్న ప్రశ్న సహజంగానే జనసైనికుల్లో ఎదురవుతుంది. నిజానికి నాగబాబు వల్ల పార్టీకి ప్రత్యేకంగా ఒనగూరిన ప్రయోజనం ఏమీ లేదని, పవన్ కున్న క్రేజ్, ఇమేజ్ ఆయనకు లేదని, అటువంటి నాగబాబుకు పదవి ఇవ్వడం ఏంటని కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు. కానీ పవన్ తాను చేసిందే శాసనం.. చెప్పిందే చట్టం అని వ్యవహరిస్తున్నారని, ఈ నిర్ణయాల వల్ల జనసేనకు రాజకీయంగా నష్టం జరుగుతుందన్న కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే పవన్ కళ్యాణ్ తన సొంత అన్నకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వకుండా, పాలనాపరమైన కార్పొరేషన్ పదవితో సరిపెట్టడం ద్వారా రాజకీయ విమర్శలకు తావులేకుండా ఉండే వ్యూహాత్మక నిర్ణయంగా పరిశీలకులు భావిస్తున్నారు.

# ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు

- మొదటి పేజి తరువాయి

వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు."రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.

సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు.వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు.జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా,

మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.

గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం: అమెరికా రాయబారి కీలక వ్యాఖ్య

జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని, ఇక్కడికి రావడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న తొలి అమెరికా రాయబారి ఆయనే కావడం విశేషం. బుధవారం శ్రీనగర్‌లో ఆయన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో భేటీ అయ్యారు.

ఈ సమావేశం అనంతరం సెర్గియో గోర్ మీడియాతో మాట్లాడుతూ, "భారత్‌లో ఇది అత్యంత కీలకమైన ప్రాంతం. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. ఇది ఎంతో రమణీయమైన ప్రదేశం" అని కొనియాడారు. కశ్మీర్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడిన నేపథ్యంలో, అమెరికా పౌరుల కోసం జారీ చేసిన ప్రయాణ హెచ్చరికలను (ట్రావెల్ అడ్వైజరీ) సడలించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. పలువురు అమెరికన్లు ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు.ఈ పర్యటనలో భాగంగా రాయబారి సెర్గియో గోర్, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా సమావేశం కానున్నారు. అనంతరం గురువారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించనున్నారు. కాగా, కశ్మీర్ సమస్యలు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన అంతర్గత విషయాలని, ఇందులో వాషింగ్టన్ జోక్యం అవసరం లేదని, అందుకే అమెరికా రాయబారితో ఈ అంశాలను ప్రస్తావించబోనని ఒమర్ అబ్దుల్లా ఈ పర్యటనకు ముందే స్పష్టం చేశారు

# మండలిలో గళం బలంగా వినిపించాలి.. వర్ల రామయ్యతో మంత్రి లోకేశ్

- మొదటి పేజి తరువాయి

శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం వర్ల రామయ్య, అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మంత్రి లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు మంత్రి లోకేశ్‌కు వర్ల రామయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరువురు నేతలు కాసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు.అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. శాసనమండలిలో కూటమి ప్రభుత్వ విజయాలను, ప్రజా అనుకూల విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వర్ల రామయ్యకు సూచించారు. సభలో ప్రజా సమస్యలపై తమ వాణిని బలంగా వినిపించాలని కోరారు. వర్ల రామయ్య వంటి అనుభవజ్ఞుడి సేవలు మండలికి ఎంతో అవసరమని లోకేశ్ అభిప్రాయపడ్డారు.

## 2027 ఎన్నికలే లక్ష్యం.. బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.దీనికి తోడు, 2027 ఎన్నికల బరిలో నిలిపే బ్రాహ్మణులతో పాటు ఇతర అగ్రవర్ణాల అభ్యర్థులను బీఎస్పీ ఇప్పటి నుంచే ఖరారు చేయడం ప్రారంభించింది. తమ తాజా వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలలో కలవరం మొదలైందని మాయావతి వ్యాఖ్యానించారు. 2007 నాటి

"సర్వజన్" (అన్ని వర్గాల హితం) నినాదాన్ని పునరావృతం చేస్తూ, ఈసారి కూడా అగ్రవర్ణాలకు ప్రాధాన్యతనిస్తూ మరిన్ని సీట్లు కేటాయిస్తామని ఆమె హామీ ఇచ్చారు.గతంలో 2007లో "హాథీ నహీ గణేశ్ హై.. బ్రహ్మ, విష్ణు, మహేశ్ హై" అనే వినూత్న నినాదంతో బీఎస్పీ 206 స్థానాలను కైవసం చేసుకుని, 30 శాతం ఓట్ షేర్‌తో అధికార పీఠాన్ని అధిష్టించింది. అయితే, ఆ తదుపరి ఎన్నికల్లో పార్టీ ప్రాబల్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. 2022 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకే ఒక స్థానానికి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సున్నా స్థానాలకు పార్టీ పరిమితమైంది. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని సుమారు 10 శాతం బ్రాహ్మణ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండగా, మాయావతి అనుసరిస్తున్న ఈ పాత ఫార్ములా ఆమెకు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడుతుందా అనేది వేచి చూడాలి.

# భారీ చిత్రాలకు కొత్త రూల్.. తెలంగాణ సర్కార్ కీలక ఉత్తర్వులు

భారీ బడ్జెట్ సినిమాల టికెట్ ధరల పెంపు విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరల పెంపు ద్వారా అదనంగా వచ్చే వసూళ్లలో 20 శాతం మొత్తాన్ని సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు ఇవ్వాలని ఆదేశించింది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' వంటి చిత్రాలకు ఇది వర్తించనుంది. ఈ సినిమాల టికెట్ ధరల పెంపుతో వచ్చిన కలెక్షన్‌లో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు, టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది.

ఈ 20 శాతం వాటాను ఎగ్జిబిటర్ల (థియేటర్ల యజమానులు) నుంచి వసూలు చేసి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన బాధ్యత నిర్మాతలపై ఉంటుందని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల విడుదలైన భారీ చిత్రాలతో పాటు భవిష్యత్తులో రాబోయే పెద్ద సినిమాలకు కూడా ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నిర్ణయంతో సినీ పరిశ్రమలోని కార్మికుల సంక్షేమానికి ఆర్థిక భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు.. అసెంబ్లీలో సందడి

- మొదటి పేజి తరువాయి

కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు.

వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి. ప్రతి చిత్రం రాబోయే తరాల కోసం కాలంలోని ఒక భాగాన్ని భద్రపరుస్తుంది. స్ఫూర్తినిచ్చే క్షణాలను బంధిస్తూ ఫొటోగ్రఫీ కమ్యూనిటీ ముందుకు సాగాలి" అంటూ చంద్రబాబు తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై బొత్స కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## త్వరలో కొత్త రాజకీయ పార్టీ పెడతా

- మొదటి పేజి తరువాయి

బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకు న్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజా పక్షంగా ప్రజల కోసం, ప్రజల గొంతుక వినిపించేందుకు కొత్త పార్టీ స్థాపిస్తానని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం లేకుండా దేశం సుభిక్షింగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ నెలలోనే తదుపరి రాజకీయ ప్రణాళికను చెబుతానని వెల్లడించారు.

## మేయర్, మున్సిపల్ చైర్మన్ లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు... కీలక బిల్లుకు ఏపీ శాసనసభ ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న క్రమంలో ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది ప్రభుత్వం. ఈ సందర్భంగా సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని... అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని.. 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని అన్నారు నారాయణ. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు మంత్రి నారాయణ.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్, చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని అన్నారు.

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుంది.

రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుంది.

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం, పనులు వేగవంతం.

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుంది.

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది.

# బెట్టింగ్ యాప్స్ కేసు ఈడీ ముందుకు హీరోయిన్ నిధి అగర్వాల్

ప్రముఖ సినీ నటి నిధి అగర్వాల్ బుధవారం హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి (ప్రమోషన్‌కు) సంబంధించిన కేసులో అధికారులు ఆమెను ప్రశ్నిస్తున్నారు. ఈడీ జారీ చేసిన సమన్ల మేరకు, నిధి అగర్వాల్ ఈరోజు ఉదయం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించి హవాలా మార్గాల్లో ద్వారా ఆమె నగదు లావాదేవీలు జరిపారన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ యాప్‌ల ప్రమోషన్ ద్వారా ఆమె అందుకున్న పారితోషికం, కమీషన్ల వివరాలపై అధికారులు ప్రధానంగా ఆరా తీస్తున్నారు.ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులను ఈడీ విచారించిన సంగతి తెలిసిందే. గతంలో ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, మంచు లక్ష్మి వంటి నటీనటులను అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈ జాబితాలో నిధి అగర్వాల్ కూడా చేరారు. ప్రస్తుతం అధికారులు ఆమె నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేస్తున్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# 'మీ భూమి--మీ హక్కు'పై అవగాహన




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 19:** ప్రతి రైతు 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమంపై అవగాహన కలిగి ఉండాలని మండల ఉప తహశీల్దార్ డి.సత్యనారాయణ సూచించారు. లకవరపుపేట పంచాయతీ తూరుమామిడిలో బుధవారం 'మీ భూమి--మీ హక్కు' రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప తహశీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా భూ వివరాలను పక్కాగా నమోదు చేసుకోవచ్చని, భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా ప్రభుత్వం చేపడుతున్న సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు లోవకోటిపడాల్, వీఆర్వో శ్రీనివాస్, సర్వేయర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 19:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి డీఎస్పీ సీహెచ్.తిరుమలరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గూడెంకొత్తవీధి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం డీఎస్పీ సందర్శించారు. గూడెంకొత్తవీధి సీఐ బి.సుధాకర్, ఎస్సై కె.సురేష్‌లతో కలిసి విద్యార్థులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, సోషల్ మీడియా వినియోగం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలలపై జరిగే వేధింపులు, నేరాల నుంచి రక్షణ పొందేందుకు పోక్సో చట్టంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అలాగే రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 19:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎటువంటి లోపాలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ప్రీ-ఎలక్షన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్, ఎన్నికల ప్రచురణ, ఓటర్ల విభజన తదితర అంశాలపై అధికారులు చర్చించారు. అర్బన్ లోకల్ బాడీస్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన దశలను వివరించారు. నోటిఫికేషన్ అనంతరం నిర్ణీత గడువులో పోలింగ్, అనంతరం నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన చేపట్టాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం, ఎన్నికల సామగ్రి సిద్ధం, మౌలిక వసతుల కల్పన, సిబ్బందికి శిక్షణ తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని తెలిపారు. ఓటర్ల వివరాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాల వారీగా సక్రమంగా విభజించి, డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకోవాలని సూచించారు.ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ మాడ్యూళ్లలో నిర్ణీత సమయంలో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టీ. నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జనసేన శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి?

- ముగ్గురి పేర్లపై అధిష్టానం కసరత్తు..
- ప్రస్తుత అధ్యక్షుడు చంద్రమోహన్‌కే మరోసారి అవకాశమా?



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ , శ్రీకాకుళం ఆగస్టు 19:** జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. జిల్లా అధ్యక్షుడి ఎంపికపై పార్టీ అధిష్టానం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు డి.పి. చంద్రమోహన్‌తో పాటు శ్రీకాకుళం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శ్రీధర్, పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త కలక రమణ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. దీంతో జిల్లా అధ్యక్ష పీఠం ఎవరిని వరించనుందన్న అంశం జనసేన శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**అనుభవానికే పెద్దపీట?**

జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసే సామర్థ్యానికి అధిష్టానం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం చేసిన సేవలు, క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో అనుసంధానం, ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలను నాయకత్వ ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం.

ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు డి.పి. చంద్రమోహన్‌కు పార్టీ వ్యవహారాల్లో అనుభవం ఉండటంతో ఆయనకు మరోసారి అవకాశం కల్పించే అంశం కూడా అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2022లో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కొత్త నాయకత్వానికి ఛాన్స్ ఉంటుందా?**

మరోవైపు శ్రీకాకుళం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శ్రీధర్, పాలకొండ నియోజకవర్గ సమన్వయకర్త కలక రమణ పేర్లు కూడా బలంగా వినిపిస్తున్నాయి. జిల్లాలో పార్టీ విస్తరణకు కొత్త ఊపునివ్వడం, నియోజకవర్గాల వారీగా పార్టీ యంత్రాంగాన్ని మరింత క్రియాశీలం చేయడం, యువతతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తలను సమన్వయం చేయడం వంటి అంశాల నేపథ్యంలో కొత్త నాయకత్వానికి అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా పార్టీలో ఉన్నట్లు సమాచారం.

**ముగ్గురిలో ఎవరికి పగ్గాలు?**


శ్రీకాకుళం జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు అధిష్టానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవికి ముగ్గురి పేర్లు పరిశీలనలో ఉండటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అనుభవానికి పెద్దపీట వేసి ప్రస్తుత అధ్యక్షుడు చంద్రమోహన్‌ను కొనసాగిస్తారా? లేక కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**త్వరలోనే తుది నిర్ణయం?**

జిల్లా అధ్యక్ష పదవిపై అధిష్టానం ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని జనసేన వర్గాల్లో చర్చ సాగుతోంది. ముగ్గురిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. శ్రీకాకుళం జనసేనకు కొత్త అధ్యక్షుడు వస్తారా.. లేక ప్రస్తుత అధ్యక్షుడికే మరోసారి పగ్గాలు అప్పగిస్తారా అన్నదానికి అధిష్టానం నిర్ణయమే తుది సమాధానం కానుంది.

# గన్నెల్ల పీహెచ్‌సీకి సీఎం రాక..
# ఏర్పాట్లపై జేసీ సమీక్ష



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు, పెన్ పవర్,ఆగస్టు 19:** అరకు లోయలోని గన్నెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ముఖ్యమంత్రి ఈ నెలలో సందర్శించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనతో పాటు సంజీవని పైలట్ ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఐఏఎస్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే సంజీవని పైలట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని జేసీ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పీహెచ్‌సీలో అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.పీహెచ్‌సీలో అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, వైద్య సిబ్బంది, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను నిర్దేశిత ప్రోటోకాల్ ప్రకారం ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులోగా ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని జేసీ సూచించారు. అధికారులు గన్నెల్ల పీహెచ్‌సీని స్వయంగా సందర్శించి, అవసరమైన పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓ, అదనపు డీఎంహెచ్ఓ, వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఏకలవ్య పాఠశాలల్లో సమస్యలు ఇక సాగదీత వద్దు!"

- ఆగస్టు 31లోగా తాగునీటి సమస్యలు పరిష్కరించాలి:
- జిల్లా కలెక్టర్ టీ.నిషాంతి

**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 19:** ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో (ఈఎంఆర్ఎస్) గుర్తించిన సమస్యలకు నిర్దిష్ట కాలపరిమితి విధించి పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. పీవో ఐటీడీఏతో కలిసి ఈఎంఆర్ఎస్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలోని 11 మండలాలకు చెందిన ఈఎంఆర్ఎస్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, ఓఎస్‌డీ గురుకులం, ఇతర సిబ్బంది సమావేశానికి హాజరయ్యారు. పాఠశాల భవనాలు, ప్రహరీ గోడలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి వసతి తదితర మౌలిక సదుపాయాలపై మండలాల వారీగా సమీక్షించారు. పూర్తయిన భవనాల్లోకి విద్యార్థులను తరలించారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి ఈఎంఆర్ఎస్ పాఠశాల ఆవరణలో సీసీ రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఆగస్టు 31లోగా తాగునీటికి సంబంధించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు.పదో తరగతి విద్యార్థుల విద్యా ఫలితాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 60 మంది విద్యార్థులను ఎంపిక చేసి దుంబ్రిగూడలో ప్రత్యేక శిక్షణ, అకడమిక్ ఫోకస్ కల్పించాలని ఆదేశించారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచడంతో పాటు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.సమస్యలను గుర్తించడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి సమస్యకు నిర్దిష్ట టైమ్‌లైన్ నిర్ణయించి, ఆ గడువులోగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. తమ పరిధిలోని సమస్యలను ప్రిన్సిపాళ్లు ఆలస్యం చేయకుండా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సంబంధిత శాఖలు, ఇంజినీరింగ్ అధికారులు, గురుకులం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల విద్య, భద్రత, సంక్షేమానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలల నిర్వహణను పటిష్టం చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించి, అవసరమైన వైద్య పర్యవేక్షణ కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలు ఓఎస్‌డీ గురుకులంతో సమన్వయం చేసుకుని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు, సురక్షిత వాతావరణం, ఆరోగ్య పరిరక్షణ, ఉత్తమ విద్యా ఫలితాలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.



# జీవో నెం3కీ ప్రత్యామ్నాయ అసెంబ్లీ లో బిల్లు ప్రవేశపెట్టాలి.




**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 19 పెన్ పవర్.** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో షెడ్యూల్డ్ ఏరియాల్లోని గిరిజన ఉపాధ్యాయులహక్కులు,స్థానిక రిజర్వేషన్ల పరిరక్షణ జీవో నెం. 3పునరుద్ధరణ ప్రత్యామ్నాయ బిల్లుఅంశంపై ప్రభుత్వం వెంటనే చట్టం రూపొందించేలా చర్యలు చేపట్టాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మక గోపాల్ డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,?భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ప్రకారం గవర్నర్‌కు గిరిజన ప్రాంతాల సంక్షేమానికి ప్రత్యేక అధికారాలు ఉన్నాయి.స్థానిక గిరిజనుల విద్యా ప్రగతిని దృష్టిలో ఉంచుకుని కల్పించిన ఆ రక్షణ సుప్రీంకోర్టు తీర్పు ద్వారా రద్దయిన తర్వాత,ఆ ప్రాంతాల్లోని నిరుద్యోగ గిరిజన యువత భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు.ఎన్నికల ముందు ఎజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల హక్కులను కాపాడతామని,జీవో3కు ప్రత్యామ్నాయంగా బలమైన చట్టాన్ని తెస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించ్చారు.న్యాయపరమైన అడ్డంకులను అధిగమించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటి ప్రజలకు స్పష్టం చేయాలనీ రాజ్యాంగ సవరణ లేదా షెడ్యూల్డ్ ఏరియాలకు ప్రత్యేక అధికారాలు కల్పించేలా ఆర్టికల్ 371డి తరహాలో లేదా గవర్నర్ ప్రత్యేక అధికారాలను ఉపయోగించి పూర్తి స్థాయి బిల్లు (స్టేటటరీ లెజిస్ లేషన్) ప్రవేశపెట్టడానికి ఎందుకు వెనుకాడుతున్నారు.ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని కోరారు.కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా,తక్షణమే ఈ సభలోనే జీవో నెం 3 పునరుద్ధరణ ప్రత్యామ్నాయ రక్షణ బిల్లు ను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించాలని ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వానికి మరియు భారత రాష్ట్రపతి ఆమోదానికి పంపించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అప్పటివరకు గిరిజన ప్రాంతాల్లో టీచర్ నియామకాల్లో స్థానిక అభ్యర్థుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ప్రత్యేక మార్గదర్శకాలను వెంటనే ప్రకటించాలని గోపాల్ డిమాండ్ చేసారు

## చిన్నారుల పోషణపై సీడీపీవో లలితాకుమారి ఆరా

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సీడీపీవో తనిఖీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను కె.కోటపాడు సీడీపీవో లలితాకుమారి 18, 19 తేదీల్లో సందర్శించి తనిఖీ చేశారు. జీకే వీధి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చాపరాతిపాలెం, మద్దెలవీధి, గూడెంకాలనీ, గూడెం పాతవీధి, గూడెంకొత్తవీధి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు.కేంద్రాల్లోని చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించి, వారి ఆరోగ్యం, పోషణపై అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ఆరా తీశారు. కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వలసమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్.

- పీహెచ్‌సీల్లో రోగులకు భోజన సదుపాయం కల్పించాలి.
- వట్టిగెడ్డ--గుమ్మిడిగెడ్డ అనుసంధానం పూర్తి చేయాలి.



**గుమ్మలక్ష్మిపురం.ఆగష్టు19 పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు.బుధవారం నాడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వచ్చే రోగులు,వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని,పీహెచ్‌సీల్లో రోగులకు భోజన సదుపాయం కల్పించేలని దానిపైచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా వట్టిగెడ్డ--గుమ్మిడిగెడ్డ అనుసంధాన పనులను పూర్తి చేసి,సాగునీటి వనరులను సద్వినియోగం చేయాలని కోరారు.తోటపల్లి రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అంతేకాక ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.కురుపాం నియోజకవర్గం గిరిజన ప్రాంతం కావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల అవసరాలు,రైతుల సంక్షేమం,సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# దారకొండ శ్రీ దారాలమ్మ దేవస్థానంలో 'ధీర ధాత్రి'సినిమాకి శ్రీకారం





**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 19:** మన్యం ఆరాధ్య దైవం శ్రీ దారాలమ్మ అమ్మవారి సన్నిధిలో నూతన తెలుగు చిత్రం 'ధీర ధాత్రి'కి బుధవారం ముహూర్తం నిర్వహించారు. దారకొండలోని శ్రీ దారాలమ్మ ఆలయ ప్రాంగణంలో చిత్ర బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించి షూటింగ్‌కు శ్రీకారం చుట్టింది.కంభంపాటి ఫిల్మ్స్ ప్రొడక్షన్ పతాకంపై కంభంపాటి విజయ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సలాది నబిన్ పవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి చిత్ర బృందం క్లాప్ కొట్టింది. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి చిత్ర స్క్రిప్ట్‌ను అమ్మవారి సన్నిధిలో ఉంచి ఆశీస్సులు అందించారు.ఈ సందర్భంగా నిర్మాత కంభంపాటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రేక్షకులను ఆకట్టుకునే వైవిధ్యమైన కథాంశంతో చిత్రాన్ని రూపొందిస్తున్నామని, నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ ఎక్కడా రాజీపడబోమని తెలిపారు. దర్శకుడు సలాది నబిన్ పవన్ మాట్లాడుతూ సరికొత్త కథ, కథనంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతో మంచి చిత్రాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.'ధీర ధాత్రి' రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24 నుంచి ప్రారంభం కానుంది. గూడెంకొత్తవీధి, కొయ్యూరు, చింతపల్లి పరిసర ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను నేపథ్యంగా చేసుకుని చిత్రీకరణ కొనసాగించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.ఈ చిత్రంలో వంశీ కథానాయకుడిగా నటిస్తుండగా, మహిత చౌదరి కథానాయికగా పరిచయం కానున్నారు. రవికిరణ్ బోయిదాపు ఛాయాగ్రహణం, జె.కె.మూర్తి కళా దర్శకత్వం, సుభాష్ సంగీత బాధ్యతలు నిర్వహిస్తున్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు గొర్లే వీర వెంకట్, సుర్ల వీరేంద్రకుమార్, పాత్రికేయులు సాయం రమణ, మాదిరి చంటిబాబు, సాగిన లక్ష్మణరావు, చిత్ర బృందం సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## చిన్నారుల చూపుపై ప్రత్యేక శ్రద్ధ-విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు/ పెదబయలు, ఆగస్టు 19:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రారంభించింది. జాతీయ అంధత్వ నియంత్రణ, దృష్టి లోపాల నివారణ కార్యక్రమం (ఎన్ పీసీబీ ఉవిఐ )లో భాగంగా 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన కంటి పరీక్షలు ప్రారంభమై ఫిబ్రవరి 2027 వరకు కొనసాగనున్నాయి.విద్యార్థుల్లో దృష్టి లోపాలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించడం ద్వారా చదువుకు ఆటంకం లేకుండా చూడటమే కార్యక్రమం ఉద్దేశమని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులకు సైతం విద్యార్థుల కంటి సమస్యలపై అవగాహన కల్పించనున్నారు. పెదబయలులోని కేజీబీవీ బాలికల పాఠశాలలో బుధవారం 272 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ అధ్యక్షతన దృష్టి ఐ కేర్ ఆప్టోమెట్రిస్ట్ గాలి జగన్ పరీక్షలు చేశారు. వీరిలో 19 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు.పెదబయలు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డా. నిఖిల్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో కంటి పరీక్షలు, అవసరమైన శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు దృష్టి ఐ కేర్ కన్సల్టెంట్ గాలి జగన్ తెలిపారు.

## తప్పిపోయిన పోయిన ముగ్గురు గిరిజన విద్యార్థులు సురక్షితంగా గుర్తింపు





**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 19:** అరకువేలి ప్రాంతం సి. కోలనీకి చెందిన ముగ్గురు 11 సంవత్సరాల గిరిజన విద్యార్థులు పాంగి గోవర్ధన్, పాంగి సుశాంత్, దర్శన్ మంగళవారం పాఠశాల నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.ఈ విషయం స్థానిక పోలీస్ స్టేషన్, అలానే రైల్వే పోలీసుల దృష్టికి వెళ్లడంతో వారు వెంటనే స్పందించి, అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విద్యార్థుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అరకువేలి రైల్వే స్టేషన్ నుంచి విద్యార్థులు విశాఖపట్నం వైపు వెళ్లినట్లు సమాచారం అందడంతో ఆ దిశగా కూడా చర్యలు ముమ్మరం చేశారు.

తాజాగా రైల్వే శాఖ మరియు స్థానిక పోలీసుల సమన్వయంతో ముగ్గురు విద్యార్థులను విశాఖపట్నంలో సురక్షితంగా గుర్తించినట్లు సమాచారం. విద్యార్థులను ఇద్దరు యువకులు అపహరించేందుకు ప్రయత్నించి ఉండవచ్చనే అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ అంశంపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి చేరే వరకు వారి కదలికలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు.విద్యార్థుల ఆచూకీ కనుగొని వారిని సురక్షితంగా కుటుంబ సభ్యుల వద్దకు చేర్చేందుకు సహకరించిన రైల్వే శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, ఇతర సిబ్బందికి సుజాత సల్మాన్ అభినందనలు తెలిపారు. అలాగే తమ సంస్థ కార్యకర్తలు అందించిన సహకారాన్ని కూడా ఆమె అభినందించారు.

ముగ్గురు విద్యార్థుల ఆచూకీ కోసం సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసి, పోలీసులకు, కుటుంబ సభ్యులకు సహకరించిన ప్రతి ఒక్కరికీ విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు19** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు సౌజన్యంతో 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో 85 వ వార్డు ఫార్మసిటీ కాలనీలో హాస్పిటల్లో చనిపోయిన వారిని తీసుకొచ్చి శవాలను వేచే స్థలం దగ్గర నీళ్ల కోసం చాలా ఇబ్బందులు ఎదురవడంతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి దశేంద్ర తీసుకు వెళ్ళగానే బోర్ ను మంజూరు చేసి వేయించడం జరిగిందని. ఫారమాసిటీ గ్రౌండ్ దగ్గర, కొత్తపాలెం, దొప్పవానిపాలెం, పొన్నూరు అగ్రహారం గ్రామాలలో గ్రామస్తుల నీరు అవసరాల కోసం 5 బోర్లు కూటమి నాయకులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా దశేంద్ర గార మాట్లాడుతూ రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో దొంగల పార్టీల మాయమాటలు నమ్మకుండా కూటమి పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని మన కాలనీని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఇల్లపు ప్రసాద్ మాట్లాడుతూ 5 సంవత్సరాల వైసిపి ప్రభుత్వం లో నియంత పరిపాలన వలన,ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయామని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమం పరుగులు పెడుతుందని, రానున్న రోజుల్లో ఆంధ్ర రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని, కూటమిలో అభ్యర్థిని ఎవరిని నిలబెట్టిన అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రమేష్, క్లస్టర్ -1 ఇంచార్జ్ కర్రి అప్పలరాజు,85 వ వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి విందుల రాజు, అగనంపూడి హాస్పిటల్ డైరెక్టర్స్ డొక్కా రమేష్, కోసూరి తాతారావు, గజ్జల రవణమ్మ నూకరాజు, డాక్టర్ తాతాజీ, సిమ్మిటి అర్జున, పెదపాటి శివరామకృష్ణ, ఏదూరు గౌరీ, కసిపల్లి శ్రీనివాసరావు, ఏదూరు ధర్మారావు,ఏదూరు సింహాచలం నాయుడు, కర్రి చినరాజు, కర్రి తలుపులు నాయుడు,దాసరి శ్రీనివాస్ ,సంద్రానా నర్సింగరావు, దాసరి గణేషు, గొల్లవిల్లి నూకరాజు, గొల్లవిల్లి పైడిరాజు, మంత్రి గిరి ప్రసాద్, పాలవలస ఈశ్వరరావు, పితాని నీలకంఠ రావు, కందేపల్లి శంకర్రావు, గొల్లవిల్లి సత్తిబాబు, కందేపల్లి ప్రసాదు,మంత్రి శివాజీ, దొప్ప పైడిరాజు, మొల్లి అప్పారావు, దొప్ప ఆనంద్, దొప్ప సింహాచలం, దొప్ప అచ్చం నాయుడు, దొప్ప వాసు, ఏదూరి నరేంద్ర ,దుల్ల చల్లారావు, సిద్ధనాతి పైడ్రాజు, సీకు రాజు, ఏదూరి కనకారావు,ఏదూరి పెంటారావు, ఏదూరి శివ, దొప్ప వాసు దొప్ప శ్రీను, గాజువాక నియోజకవర్గం మహిళా ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, పల్లా హైమా, గోపిశెట్టి పద్మ, అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కే నాటుదాం.. రైతు ఆదాయం పెంచుదాం!

- తీములబంధలో రైతులకు మొక్కల పంపిణీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 19:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని తీములబంధ గ్రామంలో వి.బి.జి.-రామ్‌జీ పథకం ద్వారా రైతులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. రైతులకు సిల్వర్, నేరేడు, వెదురు తదితర మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కొర్ర సుభద్ర, జీకే వీధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్, నాయకులు కృపా శీమన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకుని తమ భూముల్లో నాటి తోటలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తులో రైతులకు అదనపు ఆదాయం సమకూరి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి రైతు మొక్కలను సంరక్షిస్తూ వాటిని పెద్ద చెట్లుగా అభివృద్ధి చేయాలని కోరారు.

# టిడిపి హాయాంలో బిసీ లకు సముచిత గౌరవం




**గాజువాక: పెన్ పవర్,ఆగస్టు19:** బీసీలకు ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా గౌరవాన్ని ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందిని,మాజీ మంత్రి గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హర్షం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ల కేటాయింపు పై గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి హర్ష వ్యక్తం చేసిన కిడారి శ్రావణ్ మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రసాదుల శ్రీనివాస్ రోబో ఆంధ్ర ప్రదేశ్ స్థానిక సంస్థ ఎన్నికల్లో పురపాలక మరియు పంచాయతీ ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని గాజువాక నియోజవర్గ పరిశీలకులు మాజీ మంత్రి గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో గాజువాక నియోజవర్గ బీసీ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి ఆనందాన్ని హర్షాన్ని వ్యక్తం చేశారు గాజువాక నియోజకవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొడ్డలి పార్టీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు బీసీ వర్గాల అణిచివేసి స్థానిక సంస్థల్లో వారికి తీవ్రమైన అన్యాయం చేసి 16 పోస్టులకు పంగనామాలు పెట్టారని ఎద్దేవా చూశారు. చారిత్రాత్మకమైన బిల్లు వల్ల వైకాపా లల్లో బీసీలకు జరిగిన అన్యాయం బట్టబాకలవుతుందని అన్నారు తిరిగి బీసీలకు 16 వేల స్థానాల్లో రాజకీయ అవకాశాలు లభిస్తాయి అన్నారు . చరిత్రాత్మకమైన బిల్లు ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కి సహకరించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేయూతనిచ్చిన జనసేన అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు విల్లా రామ్మోహన్ కుమార్. గుర్రం నూకరాజు మాజీ కార్పొరేటర్ రాజానరామారావు వార్డ్ అధ్యక్షుడు కర్రి దేశేంద్ర రెడ్డివాసు. చట్టి గోపి. కొవ్వూరు హరికృష్ణ. నమ్మి అప్పారావు కొల్లి నాగేశ్వరరావు 73 వార్డ్ క్లస్టర్ ఇంచార్జ్ బలగ బాలు నాయుడు వార్డు పరిశీలికులు జాజులు గంగరాజు తమ్మిరి శివప్రసాద్ కల్లేపల్లి శ్రీనివాస్ వర్మ. రాజాన రాజు74 వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ దువ్వి శ్రీను 75 వార్డ్ క్లస్టర్ఇంచార్జ్ ఉరుకుటి అప్పలరాజు.. 76 వరకు క్లస్టర్ ఇంచార్జ్ శివ 71 వ అధ్యక్షుడు నాయుడు కో క్లస్టర్ శ్రీనివాస్ సీనియర్ టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చింతలమ్మ ఘాట్ రోడ్డులో లారీ ప్రమాదం





- డ్రైవర్ మృతి, క్లీనర్ కు తీవ్ర గాయాలు
- సంఘటన స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టిన పోలీసులు, ప్రజాప్రతినిధులు

**కోయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 19:** మండలం చింతలమ్మ ఘాట్ రోడ్డులోని నాలుగోవ టర్నింగ్ వద్ద కొండను ఢీ కొట్టి లారీ ప్రమాదం జరిగింది. బుధవారం ఈ ప్రమాదంపై కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ జీరో సెవెన్ టీజే 20 75 నంబర్ గల లారీ జెడ్డంగి వద్ద ఎరువులు లోడ్ చేసుకుని నర్సీపట్నం వైపు వెళ్తుండగా, చింతలమ్మ ఘాట్ రోడ్డులోని 4వ టర్నింగ్ వద్దకు వేగంగా వస్తూ టర్నింగ్ వద్ద లారీని డ్రైవర్ అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న కొండను ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో అటుగా వెళ్తున్న కోయ్యూరు సీఐ ప్రమాదాన్ని గమనించి వెంటనే సంఘటనా స్థలంలో ఆగి, పరిస్థితిని పరిశీలించి సహాయక చర్యలను ప్రారంభించారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులను కూడా ఆపి వారి సహాయంతో ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ కాళు ఇరుక్కుపోవడంతో అతన్ని సురక్షితంగా బయటకు తీసేందుకు జెసిబి లు , ప్రొక్లైన్లు తెప్పించి లారీని తొలగించే చర్యలు చేపట్టారు.

సి ఐ పరిస్థితిని వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేస్తూ, ప్రమాదంలో గాయపడిన వారికి వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఆయన సమాచారం అందించిన వెంటనే రాజేంద్రపాలెం వైద్యులు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన లారీ క్లీనర్‌కు అక్కడికక్కడే ప్రథమ చికిత్స అందించారు.

ఈ సహాయక చర్యలకు కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, కోయ్యూరు టిడిపి మండల అధ్యక్షులు కాకూరి చంద్రావు, కాకరపాడు లోవరాజు, అలాగే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సహకరించారు. జెసిబిలు, ప్రొక్లైన్ల సహాయంతో లారీని తొలగించి క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సలపు కృష్ణ, (తండ్రి-లేట్) రామయ్య, 51 సంవత్సరాలు, కులం కాపు, లారీ డ్రైవర్, సలూరు, విజయనగరం జిల్లా తీవ్రంగా గాయపడ్డాడు. లారీ క్యాబిన్‌లో కాళ్లు ఇరుక్కుపోవడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్‌కు ప్రాణాలు కాపాడేందుకు వైద్య సిబ్బంది చికిత్స అందించేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యాధికారి జగదీష్ నాయక్ నిర్ధారించారు.



లారీ క్లీనర్ షేక్ ఆసీర్, తండ్రి హొస్సేన్, వయస్సు 43 సంవత్సరాలు, వాస్త్రపురి కాలనీ, కొట్టవలస గ్రామం, రాజాం, శ్రీకాకుళం జిల్లా గాయపడ్డాడు. అతనికి సంఘటనా స్థలంలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

మృతదేహాన్ని తదుపరి చట్టపరమైన ప్రక్రియ నిమిత్తం నర్సీపట్నం మార్చురీకి తరలించి, ఇన్‌క్వెస్ట్ నిర్వహించేందుకు చర్యలు చర్యలు తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదంపై ఫిర్యాదు స్వీకరించి, నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపడతామని . ప్రమాద సమయంలో తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన పోలీసు అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజల సహకారం అభినందనీయం అని పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఘనంగా రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 19:** రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పుట్టినరోజు వేడుకలను ఆర్భాటాలకు, వృథా ఖర్చులకు పరిమితం చేయకుండా పేదలు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న వారికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ సానా సతీష్ బాబు ఇచ్చిన పిలుపు మేరకు ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు.కాకినాడ కొప్పవరంలోని ఎంపీ కార్యాలయంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది దివ్యాంగులకు ప్రత్యేక బహుమతులను పంపిణీ చేశారు. అదేవిధంగా భారీ ఎఱఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఎంపీ సానా సతీష్ బాబు పుట్టినరోజు సందర్భంగా కాకినాడకే పరిమితం కాకుండా కాకినాడ, ఏలూరు, కోనసీమ, రాజమహేంద్రవరం, కడప జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, కార్యకర్తలు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. అన్నదానం, నిత్యావసర వస్తువుల పంపిణీ, దివ్యాంగులకు సహాయ కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సేవా కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వేల మందికి పైగా దివ్యాంగులు, పేదలు, నిరుపేద కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పుట్టినరోజు వంటి ప్రత్యేక సందర్భాలను సామాజిక సేవకు వేదికగా మార్చి సమాజంలోని అవసరమైన వర్గాలకు చేయూతనివ్వాలన్నదే ఎంపీ సానా సతీష్ బాబు ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలన్న ఎంపీ సానా సతీష్ బాబు పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగులు, పేదలు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అవసరమైన వస్తువులు అందించడం, అన్నదానం చేయడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించగలిగామని చెప్పారు.

సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో అరగేళ్ల శ్రీనివాసరావు (బున్నీ), మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తోట నవీన్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, న్యూటన్ ఆనంద్, ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేక లక్ష్మణ్, ముమ్మడి వెంకటేశ్వర్లు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, అంకమ్మరెడ్డి రామనాయుడు, బొబ్బిలి గోవింద్, కామడి దశరథ్, దేవ్ వెంకన్న, చీకట్ల వెంకటేష్, కోడి సీతారాం, రాయుడు దుర్గా, పాలిక సతీష్, పోలిశెట్టి తాతీలు, కృష్ణమూర్తి, బోడి వెంకట్, గింజాల శ్రీనివాసరావు, పలివెళ్ల సతీష్, జార్జ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, పేదలు పాల్గొన్నారు.

# అవగాహనతోనే అనర్థాలకు చెక్.

- గంజాయి నిర్మూలన, మహిళల భద్రతలో ప్రజలదే కీలకపాత్ర.
- రహదారి నిబంధనలు తప్పనిసరి: ఎస్ఐ వీరబాబు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 19.** సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అత్యంత కీలకమని చింతపల్లి ఎస్ఐ జి. వీరబాబు అన్నారు. స్థానిక వారపు సంతలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు పలు సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, వ్యాపారులు, స్థానికులను సమావేశపరిచి ఆయన పలు సూచనలు చేశారు. ప్రధానంగా గంజాయి సాగు, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ఆయన స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వ్యామోహంలో పడి యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి సాగు చేసినా, విక్రయించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆపదలో ఉన్నవారు వెంటనే డయల్ 100 లేదా పోలీసులను ఆశ్రయిస్తే తక్షణ సాయం అందిస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రహదారి భద్రత, రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి, అతివేగంతో వాహనాలు నడపడం, మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వడం లాంటి నిర్లక్ష్యపు చర్యల వల్లే నిండు ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేర రహిత సమాజం కోసం పోలీసులు పడుతున్న ఈ శ్రమకు ప్రతి పౌరుడూ బాధ్యతగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో ఘనంగా నూతన బీ.టెక్ విద్యార్థుల ప్రారంభోత్సవ కార్యక్రమం



**గాజువాక :పెన్ పవర్ఆగస్టు 19**, దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఆటానమస్) (వీఐఐటీ), విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ (ఆటానమస్) (వీఐఈడబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ ఘనమైన ప్రారంభ కార్యక్రమాన్ని వీఐఐటీ క్యాంపస్‌లో నిర్వహించారు.

విజ్ఞాన్ సంస్థల పూర్వ విద్యార్థి సాయి సంపత్ కుమార్ బాలివాడ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, సంస్థ అందిస్తున్న విద్యా, సహపాఠ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని, బలమైన వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఎంచుకున్న రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషి చేయాలని సూచించారు.

కార్యక్రమం విజ్ఞాన్ గీతంతో ప్రారంభమైంది. అనంతరం వీఐఐటీ, వీఐఈడబ్ల్యూ విద్యార్థులు ప్రదర్శించిన ఉత్సాహభరితమైన స్వాగత నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రముఖుల ప్రేరణాత్మక సందేశాలు, విద్యా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం, నూతన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులకు ఓరియంటేషన్, పరస్పర చర్చా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విజ్ఞాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డా. లావు రత్తయ్య నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం పలికారు. నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, నూతన ఆవిష్కరణలు, నైతిక విలువలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసం విజయవంతమైన వృత్తి నిపుణులు మరియు బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడంలో కీలకమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ విశాఖ సీఈఓ ఎన్. శ్రీకాంత్, వీఐఐటీ ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, వీఐఐటీ రెక్టర్ డా. వి. మధుసూదనరావు, వీఐఈడబ్ల్యూ ప్రిన్సిపాల్ డా. బి. అరుంధతితో పాటు డీన్లు, విభాగాధిపతులు, డిప్యూటీ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఇతర విద్యా మరియు పరిపాలనా విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు.

ఓరియంటేషన్ మరియు పరస్పర చర్చా కార్యక్రమం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థలోని విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సహాయక వ్యవస్థలు, కెరీర్ అవకాశాలు, వృత్తిపరమైన మరియు వ్యక్తిగత అభివృద్ధికి అందుబాటులో ఉన్న వివిధ అవకాశాల గురించి అవగాహన పొందారు.

నూతన విద్యార్థుల విద్యా ప్రయాణానికి ఈ ఘన ప్రారంభ కార్యక్రమం ఒక చిరస్మరణీయమైన, స్ఫూర్తిదాయకమైన ఆరంభంగా నిలిచింది. నాణ్యమైన విద్యను అందించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం, విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో కూడిన నైపుణ్యవంతులు మరియు బాధ్యతాయుతమైన వృత్తి నిపుణులుగా తీర్చిదిద్దడంలో విజ్ఞాన్ సంస్థల నిబద్ధతను ఈ కార్యక్రమం పునరుద్ఘాటించింది.

# స్థానిక పోరుకు వైకాపా సమర శంకరావం.

- అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయానికే పెద్దపీట: ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు.
- చింతపల్లిలో ఉత్సాహంగా వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమ్మేళనం.

**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 19.** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వంద శాతం విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో ఎవరి ఇష్టారాజ్యాలకు తావులేదని, కేవలం క్షేత్రస్థాయి కార్యకర్తల అభిప్రాయాల మేరకే పారదర్శకంగా టికెట్ల కేటాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద వైకాపా మండల అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన కొత్తలో వైకాపా శ్రేణులను ప్రలోభపెట్టాలని అధికార పక్షం నాయకులు చూసినా ఎవరూ లొంగలేదని, పార్టీ జెండాను గుండెల్లో పెట్టుకున్న కార్యకర్తల నిబద్ధత వెలకట్టలేనిదని కొనియాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నియోజకవర్గంలోని 109 పంచాయతీల్లో యువజన, విద్యార్థి, మహిళా, రైతు విభాగాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. ఇప్పటికే 31 పంచాయతీల్లో ఏకాభిప్రాయంతో సింగిల్ క్యాండిడేట్‌లను ఖరారు చేశామని, మిగిలిన చోట్ల కూడా గెలుపు గుర్రాలకే అవకాశమిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. గత వైకాపా హయాంలోనే పూర్తయిన గిన్నెలకోట వంతెనను జగన్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే అక్కసుతోనే నేటికీ ప్రారంభించలేదని విమర్శించారు. నర్సీపట్నం-సీలేరు మార్గంలో అరకొర పనులు చేసి పూర్తిచేసినట్లు అసత్యాలు చెబుతున్నారని, గత ప్రభుత్వం తెచ్చిన 17 మెడికల్ కాలేజీల క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఏజెన్సీలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలను రెండున్నరేళ్లలో కేవలం ఒక్కసారే తూతూమంత్రంగా నిర్వహించి గిరిజన అభివృద్ధిని గాలికొదిలేశారని మండిపడ్డారు. ఎంపీపీ కోరాబు అనుషాదేవి మాట్లాడుతూ..పార్టీ అధిష్ఠానం నివేదికల ఆధారంగా ఖరారు చేసిన అభ్యర్థులకే శ్రేణులంతా మద్దతుగా నిలవాలని, రెబల్స్‌కు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పార్టీ కోసం




కష్టపడిన మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వ బురదజల్లే రాజకీయాలను గతంలో తాము చేసిన అభివృద్ధి పనుల ఆధారాలతో తిప్పికొట్టాలన్నారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు. నియోజకవర్గంలో ఒక 'షాడో ఎమ్మెల్యే' పెత్తనంతో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం ఎక్కడికక్కడే నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో చింతపల్లిలో సాధించిన 7 వేల మెజార్టీ స్ఫూర్తిగా, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేలా శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మాజీ సర్పంచ్ పుష్పలత, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, జిల్లా రైతు విభాగం కార్యదర్శి బి.కృష్ణ, విద్యార్థి విభాగ కార్యదర్శి శ్రీరాములు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జి.శేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు గంగన్న పడాల్, వైస్ ఎంపీపీ శారద, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, విద్యార్థి విభాగ మండల అధ్యక్షులు యోసెఫ్, యువజన విభాగ అధ్యక్షులు పండు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సిహెచ్ అప్పారావు, మహిళా విభాగ అధ్యక్షురాలు ఎం. సంధ్యారాణి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కె.ఈశ్వరరావు, మోరి రవి తదితరులతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముంచంగిపుట్టులో ఘనంగా ప్రపంచ ఫోటో గ్రఫి దినోత్సవ వేడుకలు

- చరిత్రను కళ్లముందు నిలిపేది ఫోటో గ్రాఫి - ఎస్ఐ పి నాని.
- ఫోటోగ్రఫీ యూనియన్ అధ్యక్షుడు జీ సన్యాసిరావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 19.** ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవము ఘనంగా నిర్వహించారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలలాకు చెందిన ఫోటో గ్రాఫర్ల యూనియన్ నాయకులు, ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని గిరిజన ఉద్యోగ భవనంలో మల్టీ ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జీ సన్యాసిరావు, కొర్ర బాబులాల్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. మొదటిగా ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ జాక్వెస్ట్ మాండే డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వేడుకల ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్సై పీ నాని మాట్లాడుతూ.. కాలగర్భంలో కలిసిన చరిత్రను సజీవంగా నిలిపేది కేవలం ఫోటో మాత్రమేనని, నేటి ఆధునిక యుగంలో ఫోటోకి ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయన అన్నారు. ఎన్నో విలువైన రూపాలను ఇప్పటికీ ఎప్పటికీ ఏనాటికి నిలిచి ఉండే విధంగా చేసే శక్తి కేవలం ఫోటోకి మాత్రమే ఉందని ఎస్సై అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫోటో, వీడియో గ్రాఫర్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పలువురు సీనియర్ ఫోటో గ్రాఫర్లు రమేష్, చలపతి, తదితరులు మాట్లాడుతూ.. ఫోటో గ్రఫీలో వారి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. బ్లాక్ అండ్ వైట్ కాలంలో వాలు పడిన కష్టాలను ఈ సందర్భంగా నేటి తరం ఫోటోగ్రాఫర్లకు వివరించారు. మొదట ఫోటో రంగా వృత్తిలో ఉన్నప్పటికీ తరువాత వివిధ రంగాల్లో స్థిరపడ్డామని అయినప్పటికీ అంతిమంగా తమకు కడుపు నింపిన ఫోటోగ్రఫీను మాత్రం కొనసాగిస్తామని ఈ సందర్భంగా సీనియర్లు పేర్కొన్నారు.

**సీనియర్ ఫోటోగ్రాఫర్లకు సన్మానం**

మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఫోటో వీడియో గ్రాఫర్లు పి. ప్రభాకర్ రావు, వంపూరి చలపతిరావు, వెంగడ రమేష్ లతో పాటు డాక్టర్ ఆదిత్య వర్మ, పాత్రికేయులు కె మోహన్, కె రాంబాబు, ఎస్ సురేష్, కే అనిల్ లకు యూనియన్ నాయకులకు సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో మల్టీ ఫోటోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కొర్రా బాబూలాల్, రెండు మండలాల సభ్యులు వి. చంద్రశేఖర్ బి. శ్రీనివాసరావు, జి. అనిల్, వి.రాము, ఎస్.అజయ్, వి. రాజు, వి శివాజీ, జి చరణ్, వెంకటేష్ పడాలి, ఆర్. చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి.




**డుంబ్రిగూడ పెన్ పవర్ ఆగస్టు,19:** అరకు మేజర్ నేరేడు వలస టి డబ్ల్యూ జీపీఎస్ పాఠశాల స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సాల్మన్ సుజాత డిమాండ్ చేశారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల స్థలానికి సంబంధించిన రికార్డులు ఉన్నప్పటికీ గిరిజన నేతలు అక్రమ కట్టడాలు నిర్మించుకోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ,తక్షణమే అధికారులు స్పందించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న గిరిజననేతరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె హెచ్చరించారు

## వంచులలో రైతులకు యూరియా పంపిణీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 19 (పెన్ పవర్):** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం వంచుల పంచాయతీలో రైతులకు యూరియాను పంపిణీ చేశారు. వంచుల సచివాలయం వద్ద ఆయా గ్రామాలకు చెందిన రైతులకు మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు చేతుల మీదుగా యూరియా అందజేశారు.రైతులకు సాగు సమయంలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. రైతులు యూరియాను సద్వినియోగం చేసుకుని పంటల దిగుబడిని పెంచుకోవాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లంగి అచ్యుత్,తెలుగు యువత మండల అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు, జనసేన పార్టీ పంచాయతీ ఉపాధ్యక్షుడు వనపల ఈశ్వరరావు,యూనిట్ ఇన్‌చార్జి ముర్ల భూపతి అగ్రికల్చర్ అసిస్టెంట్ సీహెచ్. రీనా, సచివాలయ సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్.

**పీహెచ్‌సీల్లో రోగులకు భోజన సదుపాయం కల్పించాలి.**

**వట్టిగెడ్డ--గుమ్మిడిగెడ్డ అనుసంధానం పూర్తి చేయాలి.**



**గుమ్మలక్ష్మీపురం.ఆగష్టు19 పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వాన్ని ప్రభుత్వ విప్,కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు.బుధవారం నాడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం వచ్చే రోగులు,వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారని,పీహెచ్‌సీల్లో రోగులకు భోజన సదుపాయం కల్పించేలని దానిపైచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా వట్టిగెడ్డ--గుమ్మిడిగెడ్డ అనుసంధాన పనులను పూర్తి చేసి,సాగునీటి వనరులను సద్వినియోగం చేయాలని కోరారు.తోటపల్లి రిజర్వాయర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అంతేకాక ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.కురుపాం నియోజకవర్గం గిరిజన ప్రాంతం కావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కార మార్గాలు చూపాలని ఎమ్మెల్యే అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల అవసరాలు,రైతుల సంక్షేమం,సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## స్థానిక సమరానికి సిద్ధం కావాలి-అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండొచ్చు



టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

**స్టాఫ్ రిపోర్టర్, పాడేరు, ఆగస్టు 19 (పెన్ పవర్):** అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. బుధవారం పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెలరోజుల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాలకు రహదారులు, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన వారికి పెన్షన్లు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ట్రైకార్ రుణాలు తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి గ్రామంలో ప్రజలకు ప్రయోజనం చేకూరిందని ఆమె పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశామని తెలిపారు. జీవో నంబర్ 3 అంశాన్ని కూడా కూటమి ప్రభుత్వం న్యాయపరమైన సమస్యలను పరిష్కరించి అమలు చేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని గిడ్డి ఈశ్వరి సూచించారు. కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు, టిడిపి అబ్జర్వర్ రత్న కుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, డిసిసి డైరెక్టర్ బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమ గంజాయి పట్టివేత

- 11 లక్షల 5వేల రూపాయల విలువ చేసే 22.100కేజీల గంజాయి స్వాధీనం.
- ముగ్గురు గంజాయి నిందితులకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలింపు.
- రెండు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం.
- ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 19.** అల్లూరి సీతారామరాజు జిల్లా, ముంచంగిపుట్టు మండలం, జోలాపుట్టు పంచాయతీ, లబ్బురు జంక్షన్ వద్ద 22.100 కిలోల 11లక్షల 5వేల రూపాయల అక్రమ గంజాయినీ స్వాధీనం చేసుకున్నట్లు ముంచంగిపుట్టు ఎస్ఐ పి నాని తెలిపారు. బుధవారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటన ప్రకారం.. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాలతో అక్రమ గంజాయి రవాణాపై పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో భాగంగా బుధవారం సాయంత్రం లబ్బురు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమ గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఒడిశా రాష్ట్రం, కొరాపుట్ జిల్లా, లమతపుట్ బ్లాక్‌కు చెందిన బలరామ్, నిలు, గణపతిలుగా గుర్తించమని ఆయన తెలిపారు. ఒడిస్సా ప్రాంతం నుండి జోలాపుట్టు మీదుగా ఒడిస్సాలో తీసుకొని వెళ్ళే క్రమంలో లబ్బారు జంక్షన్ వద్ద 22.100 కిలోల గంజాయి పట్టుబడిందని, వారి వద్దనుండి 2 హీరో స్పెండర్ ప్లస్ బైక్‌లు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన అన్నారు. ముగ్గురు గంజాయి నిందితులను కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఎస్ ఐ పి నాని అన్నారు. జి.మాడుగుల సీఐ ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈ దాడి నిర్వహించి నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అక్రమ గంజాయి రవాణాపై కఠిన చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో లక్ష్మి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అచ్చెన్నాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలి: ఆల్ఫా కృష్ణ

**కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను 'దద్దమ్మ' అని సంబోధించడం సరికాదు**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగష్టు 18:** కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను 'దద్దమ్మ' అంటూ మంత్రి అచ్చెన్నాయుడు సంబోధించడం తీవ్ర అభ్యంతరకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ అన్నారు. బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆల్ఫా కృష్ణ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు సభల్లో హుందాగా, బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని విమర్శించారు.

'దద్దమ్మ' అనే పదంతో అచ్చెన్నాయుడిని ఎవరైనా సంబోధిస్తే ఆయన అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. ఇలాంటి వ్యక్తిగత వ్యాఖ్యలు పెద్దల సభల గౌరవాన్ని దిగజార్చుతాయని అన్నారు. అచ్చెన్నాయుడు సోదరుడు, దివంగత ఎర్రన్నాయుడు వంటి సీనియర్ నాయకులు పాటించిన రాజకీయ విలువలను గుర్తు చేసుకోవాలని సూచించారు.

**డీఎస్సీపై ప్రభుత్వ వైఖరి ఏమిటి?**

అసెంబ్లీలో డీఎస్సీ అంశంపై చర్చ జరిపి, మెజారిటీ ఉందనే కారణంతో తీర్మానం చేసుకున్న అధికార పక్షం.. మరుసటి రోజు కౌన్సిల్‌లో అదే అంశంపై చర్చ అవసరం లేదని చెప్పడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆల్ఫా కృష్ణ విమర్శించారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు.

అవినీతి జరగలేదని ప్రభుత్వం భావిస్తే స్వతంత్ర దర్యాప్తును ఎదుర్కోవడానికి ఎందుకు వెనుకాడుతోందని నిలదీశారు. డీఎస్సీ అంశంపై నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్న సమయంలో వైసీపీ కార్యక్రమాలపై స్పందించకుండా, ఆ తర్వాత భారీ ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం రాజకీయ డ్రామాగా అభివర్ణించారు. యువతకు డీఎస్సీపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**వైఎస్సార్ పాలనను గుర్తు చేసిన ఆల్ఫా**

గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణకు సిద్ధమని చెప్పిన విషయాన్ని ఆల్ఫా కృష్ణ గుర్తు చేశారు. ప్రజా జీవితంలో విశ్వాసం, నైతికత, జవాబుదారీతనం అవసరమన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై తప్పు నిర్ధారణ అయితే చర్యలు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి ఉండాలని అన్నారు.

**'బొత్సకు క్షమాపణ చెప్పాలి'**

కౌన్సిల్‌లో బొత్స సత్యనారాయణను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆయనను మాత్రమే కాకుండా ఆయనను గౌరవించే ప్రజలను కూడా అవమానించేలా ఉన్నాయని ఆల్ఫా కృష్ణ అన్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడిని సభలో అవమానించేలా మాట్లాడటం ద్వారా కాపుల పట్ల ప్రభుత్వ వైఖరి ఏమిటో వెల్లడైందని ఆరోపించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అభివృద్ధి, డీఎస్సీ వ్యవహారం, ప్రస్తుత పాలనతో పాటు గత రాజకీయ పరిణామాలపై చర్చకు వైసీపీ సిద్ధంగా ఉందన్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో ప్రతిపక్షాన్ని తక్కువ చేసి మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు.

**క్షమాపణ చెప్పకపోతే పోరాటం**

ఇప్పటివరకు ఓపికగా ఉన్నామని, ఇకపై అధికార పార్టీ నాయకులు చేసే ప్రతి వ్యాఖ్యకు వైసీపీ గట్టిగా సమాధానం ఇస్తుందని ఆల్ఫా కృష్ణ అన్నారు. అరెస్టులు, కేసులు, జైళ్లతో తమ గొంతును అణచలేరని పేర్కొన్నారు.

బొత్స సత్యనారాయణకు అచ్చెన్నాయుడు క్షమాపణ చెప్పకపోతే వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు ప్రజల్లో బాధ్యతగా మెలగాలని, వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దూరంగా ఉండాలని సూచించారు.




## మూగజీవులకు వ్యాక్సినేషన్లు.



**డుంబ్రీగూడ పెన్ పవర్,ఆగస్టు 19:** మండల కేంద్రంలోని టెక్కిలిబిడ్డ, సంత వలస వీధిలో బుధవారం స్థానిక పశు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 186 పశువులకు ఎల్ ఎస్ డి వ్యాక్సినేషన్,130 మేకలకు ది వార్మింగ్ వ్యాక్సినేషన్లను వేశారు. అనంతరం పశువైద్యాధికారిని రాజశ్రీ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్లో మూగజీవులకు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ వ్యాక్సినేషన్లను వేస్తున్నామన్నారు. రైతులు పశువుల శాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పశువులు, మేకలకు ఎటువంటి వ్యాధులు వ్యాప్తి చెందిన వైద్య సేవలు అందించడానికి మందులు పశు వైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఏ గ్రామంలోనైనా మూగ జీవులకు వ్యాధులు వ్యాప్తి చెందితే తక్షణమే పశు వైద్య సిబ్బందికి సమాచారం అందిస్తే వైద్య సేవలను అందించడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోతంగి పంచాయతీ ఎంపీటీసీ ఎం గీత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మదన్ రావు, పశు వైద్య శాఖ సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ ఎస్ సుబ్బారావు, ఏ హెచ్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ లో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయలి.

**కురుపాం ఆగస్టు 19 పెన్ పవర్.**



పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన ప్రాంతాలలో పలు సమస్యలు దీర్ఘకాలంగా నెలకొని ఉన్నాయి.అనేక సమస్యల పరిష్కారంపై ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయలని ట్రైబల్ రైట్స్ ఫోరం(టిఆర్ఎస్) జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణ,బుధవారం నాడు పత్రికా విలేకరుల సమావేశంలో ఈ విన్నవించుకుంటున్నమం,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గిరిజన ప్రాంతాల్లో అనేక సమస్యలున్నాయి ముఖ్యంగా పాలకవర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలు,రోడ్లు,తాగునీర,గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం మరియు తాగునీటి సమస్య పరిష్కరించడం పై,అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఆసుపత్రులలో సౌకర్యాలు మెరుగుపరచడం,గిరిజన విద్యార్థులకు వసతి గృహాలు,పాఠశాలల్లో కావలసిన వసతులు,వ్యవసాయ రంగంలో రైతులకు సాగునీరు,నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయుట,పండించిన పంటకు సరైన మద్దతు ధర కల్పిస్తూ మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి,అదేవిధంగా ఆదివాసి గిరిజన యువతకు స్థానిక ఉపాధి అవకాశాలు,నైపుణ్య శిక్షణ,ఐటీడీఏ/ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్ల అమలు మరియు స్వయం ఉపాధి పథకాలపై చర్చ ఐటీడీఏ స్పెషల్ డిఎస్సి తీయటం గురించి చర్చించాలన్నారు,గిరిజన విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోవడం జరుగుతుందని,ముఖ్యంగా చదువుకున్న ఆదివాసీ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక వలసలు ఎక్కువగా పెరుగుతున్నాయి.కావున ఐటీడీఏ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి,పై సమస్యలపై చర్చించి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా టిఆర్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిపై పెద్దలు కళ్ళు




- స్థలాన్ని చేదిక్కించుకునేందుకు "ఆ"న్యాయపరమైన పోరాటానికి సిద్ధం
- అధికారులు హెచ్చరిక బోర్డు పెడతారు "పెద్దలు"వాటిని తొలగిస్తారు
- ఆ స్థలం మాకే ఇవ్వండి ప్రగతి మహిళా మండలి గత రెండేళ్లుగా ఇదే తంతు
- ప్రభుత్వ స్థలంలో ఆ ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు పెట్టండి
- సిబ్బందికి ఆదేశాలు:రూరల్ ఎంఆర్ఓ పాల్ కిరణ్


**విశాఖ తూర్పు,పెన్ పవర్, ఆగస్టు 19**:తూర్పు నియోజకవర్గం 10 వ వార్డ్ రవీంద్ర నగర్ సచివాలయం 20 పరిధిలో నిర్వహించిన సర్వేనెంబర్ 99/3 సుమారు 400 గజాలు స్థలం ఉండేది. 200 గజాల స్థలం స్థానిక మహిళా మండలికి అప్పటి మూడవ వార్డు ఇప్పుడు 10వ వార్డు. మాజీ కార్పొరేటర్ నల్లూరి భాస్కరరావు కేటాయించారు. ఇదిలా ఉండగా కారణాలు ఏమైనప్పటికీ 15 నెలల క్రితం ప్రభుత్వ ఆ స్థలాన్ని కొందరు స్థానిక పెద్దలు వేరే వ్యక్తులకి అమ్మకం చేపట్టారని ప్రభుత్వ స్థలాన్ని శుభ్రపరుస్తున్న సమయంలో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు సచివాలయ సిబ్బందితో కూడి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వార్తలు రెండు దఫ్ఫారుగా వార్తాపత్రికలో వచ్చిన సంవత్సరం కాలం తర్వాత తిరిగి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నాలు సాగిస్తున్నారని, వివిధ పత్రాలు సృష్టించి న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు కోర్టును ఆశ్రయించేందుకు పావులు కలుపుతున్నారని తెలిసిన ప్రగతి మహిళా సంఘం బుధవారం రూరల్ ఎమ్మార్వో ని సంప్రదించడం జరిగింది. ఈ విషయమై పెన్ పవర్ రిపోర్టర్ రూరల్ ఎం ఆర్ ఒ పాల్ కిరణ్ వివరణ కొందరు స్థానిక మహిళ సంఘం మహిళలు నన్ను కలవడం జరిగిందని,ప్రభుత్వ స్థలం విషయం జోన్ పరిధిలో ఉన్నందున జోనల్ కమిషనర్ ను సంప్రదించమని వారికి తెలిపామని, ప్రభుత్వ స్థలం అక్రమాలకు గురయ్యే విషయం తన దృష్టికి వచ్చిందని,సిబ్బందిని స్థల పరిశీలనకు పంపించామని ప్రభుత్వ భూములను హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

విచిత్రమైన విషయం ఏమిటంటే ప్రభుత్వ స్థలం కొందరు పెద్దలు ఆక్రమించడమే కాకుండా స్థలాన్ని స్వాధీన పరుచుకునేందుకు పత్రాలు సృష్టించి న్యాయపరమైన చర్యలు చేపట్టేందుకు పావులు కదుపుతున్నారని, ప్రభుత్వ స్థలం స్థానిక ప్రజల అవసరాల మేరకు స్థలాన్ని ఉపయోగించాలని స్థలం ఆక్రమణదారులపై, అక్రమలకు సిద్ధపడుతున్న వారిపై చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కొందరు దేవాలయాలు నిర్మించడం కొందరు సంఘ బోనాలు నిర్మించడం ఈ ప్రాంతంలో పరిపాటి అయింది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడమే కాకుండా ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు అక్రమంగా ఆక్రమణలకు గురవుతుంటే అధికారులు నమ్మకు నేరెత్తినట్లు వ్యవహరించడం సమంజసం కాదని ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




## ప్రభుత్వ ఆస్తిని ఆక్రమింద భుమలు




## అభివృద్ధి, సంక్షేమం నమ్మకంతెలుగుదేశం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 19**:మాచవరం, అంబాజీపేట లలో డోర్ టు డోర్ కార్యక్రమం గణపతి వీర రాఘవులు క్లస్టర్ పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర శెట్టిబజ్జీ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు లు కూటమి ప్రభుత్వం ప్రభుత్వం రెండు సంవత్సరాల చేసిన అభివృద్ధి సంక్షేమాల వివరించడంతో పాటు వారి యొక్క సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చేయుటంతో పాటు ప్రభుత్వం హామీ లో సూపర్ సిక్స్ పథకాలు అమలు వివరించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రవణం రాము, గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్, మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కొల్లూరి దివాకర్, నాయకులు దొమ్మేటి రామారావు, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, గుత్తుల సురేష్ కుమార్, కాగితపల్లి సాయిరాం, నేలపూడి సత్యనారాయణ, బచ్చు చినబాబు, యాగన పండు చప్పిడి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు

## ఎల్నినో ప్రభావంపై పంటల ప్రణాళిక.....



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 19:**– అన్నవరం రైతు సేవా కేంద్రశీలో కె రాబర్ట్ పాల్,జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, కాకినాడ , ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు కే జె చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తుని సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి ఐదు మండలాలైన తుని ,శంకవరం ,,తొండంగి , కోటనందూరు మరియు రౌతులపూడి మండలాల వ్యవసాయ అధికారులు మరియు విస్తరణాధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఏర్పాటు చేశారు. సూపర్ ఎల్ నినో అనగా బాగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు తుని పరిధిలో ఐదు మండలాల్లో కూడా నెలకొన్న సందర్భంలో వరి సాగుకు తీవ్ర ఆటంకం జరుగుతుందని , అయినప్పటికీ ప్రతి ఎకరా ,ప్రతి సర్వే నెంబర్లలో రైతు ఏదో ఒక పంట వరికి ప్రత్యామ్నాయశీగా ఆరుతడి పంటలు కానీ, పశుగ్రాసశీ కొరకు విత్తనాలు వేసుకోవడం గాని, అలాగే ప్రకృతి వ్యవసాయంలో వివిధ నమూనాలుగానీ ,అలాగే చిరుధాన్యాల సాగు గాని పడేలా సిబ్బంది చూడాలని తెలియజేశారు. ఇందులో భాగంగా అన్ని మండలాల్లోనూ మండలాల వారీగా వరి సాధారణ విస్తీర్ణం లో ఇప్పటి వరకూ వరి ఎంత పడింది, ఇప్పటివరకు ఎంత పడాలి, ఆగస్టు 31,సెప్టెంబర్ మొదటి వారం వరకు ఎంత వరి విస్తీర్ణం పడుతుంది , ఆ తర్వాత పడలేనటువంటి దానికి ప్రతి ఎకరా కూడా ఏ విధంగా మనం ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకెళ్లాలని విషయం మీద అందరికీ దిశా నిర్దేశం చేశారు .

తుని డివిజన్ పరిధిలో వరి బదులుగా ఆరుతడి పంటలుగా సుమారు 17,759 ఎకరాలకు ప్రణాళిక సిద్ధశీ చేస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయ అధికార్లు పద్మశ్రీ,అశోక్ కుమార్, ఈశ్వర రావు, ఏ ఈ ఓ లు దైవ ప్రసాద్, అప్పారావు,శివ కుమారి,శ్రీను, సతీష్ పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న జిల్లా ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగష్టు 19:**80 వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖలలో జిల్లా ఉత్తమ ఉద్యోగాలుగా అంబాజీపేట మండలానికి సంబందించిన అవార్డు గ్రహీతులను సత్కరించారు. అంబాజీపేట మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విత్తనాల ఇంద్ర శేఖర్ అధ్యక్షతన ఎమ్ పిడివో కార్యాలయం లో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ లో జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ గా అవార్డు అందుకున్న తహసీల్దారు బి. చిన్నబాబు, జి. పెద్దిరాజు, ఐ.వి.వి. రమేష్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో దంగేటి రామకృష్ణ , మెడికల్ డిపార్ట్మెంట్ గుత్తుల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. శ్రీను లను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి , సీనియర్ నాయకులు సిఈసి మెంబెర్ పేరి కామేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎం. ఎం. శెట్టి, పేరి శ్రీను, కొర్లపాటి కోటబాబు, మైలా ఆనందరావు, వాసంశెట్టి పెదబాబు, దొమ్మేటి సత్యమోహన్, కాండ్రేగుల గోపాలకృష్ణ, విలిసత మంగతాయారు, గంటి శ్రీరామ మూర్తి, కోట విజయరాజు, వడలి కృష్ణమూర్తి, నూకపెయ్యి సత్యనారాయణ, దంగేటి సూర్యనారాయణ, అందే మూర్తి, మద్దింశెట్టి మల్లిబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు,సుధాబత్తుల రాము , కుడుపూడి సత్తిబాబు, కోట బేబీ రాణి, కుసుమ వరలక్ష్మి, కుసుమ విజయకుమారి, యెల్లమెల్లి జయబాబు, మట్టపర్తి యజ్ఞ శ్రీ వెంకటేశ్వరరావు, రాయుడు మీరయ్య, రాయుడు స్వామి, చప్పిడి పండు, పితాని సతీష్, దొంగ హరి, మట్టపర్తి నాగరాజు , బైరశెట్టి సూరిబాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవులపల్లి రామలింగం మృతి పత్రికా రంగానికి తీరని లోటు.



**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 19:** జర్నలిజం వృత్తికి అంకితమై పనిచేసిన సీనియర్ పాత్రికేయులు, వెలుగు దినపత్రిక సంపాదకులు దేవులపల్లి రామలింగం మృతి పత్రికా రంగానికి తీరని లోటని సీనియర్ రాజకీయ నాయకులు ఎస్.ఎస్ రాంకుమార్ అన్నారు. 1985లో ఆంధ్రభూమి పత్రికలో చేరి అనతి కాలంలోనే, ఉదయం స్టాఫ్ రిపోర్టర్ గా, ఉభయగోదావరి జిల్లాల వార్త బ్యూరో చీఫ్ గా పనిచేసి ఆంధ్ర ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాత్రికేయ వృత్తిలో బాగా రాణించి పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన ఘనత రామలింగానికే దక్కుదుందున్నారు. 2002లో రాజమహేంద్రవరంలో సొంతంగా వెలుగు దినపత్రికను స్థాపించి అప్పటినుండి సంపాదికుడుగా కొనసాగుతూ ప్రజా సమస్యలను వెలికి తీయడంలోనూ ఆయనకు ఆయనేసాటి అన్నారు. సూటిగా మాట్లాడే తత్వం, నిరాడంబర జీవితం, విస్తృత పరిజ్ఞానం, ఆయనకున్న ప్రత్యేకత అన్నారు. అటువంటి వ్యక్తి ఆకస్మిక మృతి చెందడం పత్రికా రంగానికి తీరని లోటని రామ్ కుమార్ అన్నారు. ఆయన కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, తెలియజేయడమే కాకుండా, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. రామలింగం మృతి పట్ల ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్, డి ఎస్ పి,డాక్టర్ దాడి కోటి, కిర్లంపూడి మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, విశ్రాంత ఉద్యోగి పెంటకోట మూర్తి, మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు,చదరం చంటిబాబు, చదరం సత్తిబాబు చదరం చినసత్తిబాబు, పెనగంటి గోవిందు ఆంధ్రభూమి సాయి, సీనియర్ జర్నలిస్ట్ శైలేంద్ర, తోపాటు పలువురు రాములమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేయడమే కాకుండా, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థించారు.

